తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | గురువారం - 23- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 49 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in

# తెలంగాణలో రాజకీయ ఉద్రిక్తత

**కరీంనగర్, హైదరాబాద్‌లో పోటాపోటీ ఆందోళనలు**
**బీజేపీ, కాంగ్రెస్ శ్రేణుల నిరసనలతో ఉద్రిక్త పరిస్థితులు**
**పలు చోట్ల నాయకుల అరెస్టులు**



**హైదరాబాద్/కరీంనగర్, జూలై 22 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలో బుధవారం రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించగా, హైదరాబాద్‌లో గాంధీభవన్ ముట్టడికి యత్నించిన బీజేపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో రెండు నగరాల్లోనూ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు భారీగా బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. కరీంనగర్‌లో బండి సంజయ్ కార్యాలయం వైపు కాంగ్రెస్ కార్యకర్తలు దూసుకెళ్లగా

మిగతా 2లో





# రాహుల్, ప్రియాంక అరెస్టును ఖండించిన రేవంత్

- విద్యార్థులకు మద్దతుగా కొడంగల్‌లో నిరసనలో పాల్గొన్న ముఖ్యమంత్రి
- శాంతియుత నిరసనకారులపై బలప్రయోగం ఆందోళనకరమని వ్యాఖ్య
- అదుపులో ఉన్న విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్

**కొడంగల్, జూలై 22 (తెలంగాణ ముచ్చట్లు):**

జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై విద్యార్థులకు మద్దతుగా నిరసన తెలిపిన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అరెస్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖండించారు.

మిగతా 2లో



# ఎల్‌నినోపై నిపుణుల కమిటీ తొలి సమావేశం

- వాతావరణ పరిస్థితులపై శాస్త్రీయ సమీక్ష
- వ్యవసాయ రంగానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందింపు
- వర్షా భావ ప్రభావంపై జిల్లా వారీగా అధ్యయనం

**హైదరాబాద్, జూలై 22 (తెలంగాణ ముచ్చట్లు):**



రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల ప్రభావాన్ని సమగ్రంగా అంచనా వేసి, వ్యవసాయం, అనుబంధ రంగాల కోసం రాష్ట్రస్థాయి అత్యవసర కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 27 మంది సభ్యుల బహుళశాఖ నిపుణుల కమిటీ తొలి సమావేశం ప్రజాభవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి అధ్యక్షతన జరిగింది. వాతావరణ మార్పుల నేపథ్యంలో ముందస్తు సన్నద్ధత, శాస్త్రీయ ప్రణాళిక అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సమావేశం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కమిటీలో భారత వాతావరణ శాఖ, అంతర్జాతీయ పంటల పరిశోధనా సంస్థ, కేంద్ర వర్షాధార వ్యవసాయ పరిశోధనా సంస్థ, జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు, వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య విశ్వవిద్యాలయాలు, చిరుధాన్యాల పరిశోధనా సంస్థ, నూనెగింజల పరిశోధనా సంస్థ,

మిగతా 2లో



# హనుమకొండలో కాంగ్రెస్ మహా ధర్నా

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో నిరసన
- పలువురు ఎమ్మెల్యేలు, నాయకుల సంఘీభావం
- నీట్ వ్యవహారంపై కేంద్రం బాధ్యత వహించాలని డిమాండ్

**హనుమకొండ, జూలై 22 (తెలంగాణ ముచ్చట్లు):**

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో మహా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహణలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత

మిగతా 2లో



# విద్యార్థులతో మంత్రి ముఖాముఖి

**ఛాత్రోంకి గూంజ్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం**

- హాస్టల్ విద్యార్థులతో సమస్యలు, భవిష్యత్‌పై చర్చ
- విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా

**హనుమకొండ, జూలై 22 (తెలంగాణ ముచ్చట్లు):**

హనుమకొండ జిల్లా ఇందిరానగర్‌లోని బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖ హాస్టల్‌లో నిర్వహించిన ఛాత్రోంకి గూంజ్ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలు, విద్య, వసతి, ఇతర అవసరాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభిప్రాయాలు, సూచనలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, అవసరమైన సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యమని తెలిపారు.

మిగతా 2లో

# విద్యార్థులపై లాఠీచార్జ్ ఖండన

**నీట్ పేపర్ లీకేజీపై కేంద్రంపై మండిపడ్డ కల్వకుంట్ల కవిత**

- బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్
- విద్యార్థుల ఆందోళనను అణచివేయడంపై తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, జూలై 22 (తెలంగాణ ముచ్చట్లు):**

నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలో ఆందోళన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని తెలంగాణ రక్షణ చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్రంగా ఖండించారు. పరీక్షను సక్రమంగా నిర్వహించలేకపోయిన కేంద్ర ప్రభుత్వం విద్యార్థులపై దాష్టీకానికి పాల్పడిందని ఆమె విమర్శించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే చర్య అని పేర్కొన్నారు.



మిగతా 2లో

# 7 వేల మెగావాట్ల షాక్‌నూ తట్టుకున్న విద్యుత్ వ్యవస్థ

- వర్షా భావ సవాళ్ల మధ్యనూ నిరంతరాయ విద్యుత్ సరఫరా
- దేశంలో తొలిసారిగా విద్యుత్ అంబులెన్స్ సేవలు ప్రారంభం
- డిస్కంలను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపే లక్ష్యమని భట్టి

**హనుమకొండ, జూలై 22 (తెలంగాణ ముచ్చట్లు):**

ఎల్‌నినో ప్రభావంతో వర్షాకాలంలోనూ వేసవిని తలపించే స్థాయిలో విద్యుత్ డిమాండ్ పెరిగి, జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గడంతో




మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తెలంగాణలో రాజకీయ ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో కార్యాలయం ఎదుటే బైఠాయించి కాంగ్రెస్ శ్రేణులు నిరసన చేపట్టాయి. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం వద్ద రాహుల్ గాంధీ చేపట్టిన ఆందోళనకు ప్రతిస్పందనగా బీజేపీ గాంధీభవన్ ముట్టడికి పిలుపునివ్వడం, దానికి ప్రతిగా కాంగ్రెస్ నాయకులు బండి సంజయ్ కార్యాలయం వైపు రావడంతో ఉద్రిక్తత నెలకొంది. హైదరాబాద్‌లో గాంధీభవన్ ముట్టడికి యత్నించిన తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశాయి.
అరెస్టుల సందర్భంగా బీజేపీ కార్యకర్తలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. గాంధీభవన్ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు అదనపు పోలీసు బలగాలను మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు. కరీంనగర్‌లో కూడా బండి సంజయ్ కార్యాలయం పరిసరాల్లో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకున్నప్పటికీ పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఇరు పార్టీల కార్యకర్తలను శాంతియుతంగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు. రాజధాని హైదరాబాద్‌తో పాటు కరీంనగర్‌లో ఒకే రోజు జరిగిన ఈ పోటాపోటీ నిరసనలు, నాయకుల అరెస్టులు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న పోలీసులు శాంతిభద్రతలకు భంగం కలగకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# రాహుల్, ప్రియాంక అరెస్టును ఖండించిన రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా కొడంగల్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరిని విమర్శించారు. ప్రశ్నపత్రం లీక్ వల్ల నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని, ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే రాజ్యాంగబద్ధ హక్కు ఉందని, దానిని గౌరవించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు.
శాంతియుత నిరసనకారులపై బలప్రయోగం జరిగిందన్న వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.




ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి చర్యలకు చోటు ఉండకూడదని, ప్రజల గొంతును అణచివేసే ప్రయత్నాలు తగవని అన్నారు. నిరసన హక్కును పరిరక్షించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. నిరసన సందర్భంగా అదుపులోకి తీసుకున్న విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. వారి ఆరోగ్య పరిస్థితి, ప్రస్తుతం ఎక్కడ ఉన్నారనే విషయాల్లో పూర్తి పారదర్శకత పాటించాలని సంబంధిత అధికారులను కోరారు. విద్యార్థుల పట్ల సున్నితంగా వ్యవహరించాలని సూచించారు.
అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలబడటంలో కాంగ్రెస్ ఎప్పుడూ వెనుకడుగు వేయలేదని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థుల హక్కులు, జవాబుదారీతనం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశాల్లో రాజీపడబోమని అన్నారు. కొడంగల్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రశ్నపత్రం లీక్ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# హనుమకొండలో కాంగ్రెస్ మహా ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

వహించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో బాధ్యులపై సమగ్ర విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశాల్లో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని అన్నారు.
శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వారు విమర్శించారు. ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన శాంతియుత నిరసన హక్కును గౌరవించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాస్వామ్య హక్కులను అణచివేసే చర్యలు సమర్థనీయం కాదని పేర్కొన్నారు.




నిరసనల సందర్భంగా అదుపులోకి తీసుకున్న విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. వారి ఆరోగ్యం, భద్రతపై పూర్తి సమాచారం వెల్లడించాలని, విద్యార్థుల హక్కులను కాపాడే విధంగా ప్రభుత్వం వ్యవహరించాలని సూచించారు. విద్యార్థుల ఆశయాలు, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు.
ప్రజల సమస్యలు, విద్యార్థుల హక్కుల విషయంలో కాంగ్రెస్ ఎప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని నాయకులు స్పష్టం చేశారు. అన్యాయానికి వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొంటూ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం ఆగదని తెలిపారు. మహా ధర్నాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నీట్ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

# 7 వేల మెగావాట్ల షాక్‌నూ wతట్టుకున్న విద్యుత్ వ్యవస్థ

(మొదటి పేజీ తరువాయి)

ఒకేసారి సుమారు 7 వేల మెగావాట్ల అదనపు భారాన్ని తెలంగాణ విద్యుత్ వ్యవస్థ సమర్థంగా ఎదుర్కొందని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హనుమకొండలోని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో విద్యుత్ రంగ ప్రగతిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సాధారణంగా వర్షాకాలంలో సుమారు 11 వేల మెగావాట్లుగా ఉండే గరిష్ఠ విద్యుత్ డిమాండ్ ఈసారి 16,500 మెగావాట్లకు చేరిందని భట్టి విక్రమార్క తెలిపారు. మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తగ్గడంతో సుమారు 2 వేల మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందని చెప్పారు. అయినప్పటికీ ముందస్తు ప్రణాళికలు, విద్యుత్ శాఖ సిబ్బంది సమిష్టి కృషితో రాష్ట్రప్రజలకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించగలిగామని వెల్లడించారు.
కాళేశ్వరం, దేవాదుల, సీతారామ వంటి భారీ ఎత్తిపోతల పథకాలకు, అలాగే వర్షాభావం కారణంగా రైతులు అధికంగా బోరు మోటార్లను వినియోగించడం వల్ల ఏర్పడిన అదనపు



విద్యుత్ అవసరాలను కూడా ప్రభుత్వం సమర్థంగా నిర్వహించిందని తెలిపారు. రాష్ట్రంలో పవర్‌కట్ అనే పరిస్థితి లేదని స్పష్టం చేసిన ఆయన, ప్రకృతి వైపరీత్యాల వల్ల స్తంభాలు, విద్యుత్ లైన్లపై చెట్లు పడినప్పుడు మాత్రమే తాత్కాలిక అంతరాయాలు ఏర్పడతాయని, వాటిని పవర్‌కట్‌గా భావించవద్దని ప్రజలకు సూచించారు. ప్రజాబాట, పొలంబాట కార్యక్రమాల ద్వారా అధికారులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను పరిష్కరిస్తున్నారని చెప్పారు. విద్యుత్ సేవలను మరింత వేగవంతం చేసేందుకు దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో విద్యుత్ అంబులెన్స్ సేవలను ప్రారంభించినట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, నిచ్చెనలు, అవసరమైన పరికరాలతో పాటు నిపుణులైన సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా ఈ సేవలను రూపొందించామని చెప్పారు. ఉచిత టోల్‌ఫ్రీ సంఖ్య 1912కు ఫోన్ చేసిన వెంటనే కృత్రిమ మేధ సాంకేతికత ద్వారా ఫిర్యాదు నమోదై, సమాచారం వెంటనే విద్యుత్ అంబులెన్స్ బృందానికి చేరి అత్యవసర సేవలు అందించే విధంగా వ్యవస్థను అభివృద్ధి చేసినట్లు వివరించారు.
డిస్కంల ఆర్థిక పరిస్థితిని మరింత బలోపేతం చేయడానికి అధిక వడ్డీతో తీసుకున్న పాత రుణాలను పునర్వ్యవస్థీకరించి రుణభారాన్ని తగ్గించే చర్యలు చేపడుతున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ చర్యలతో ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలను దేశంలోనే అత్యుత్తమ సంస్థలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందుతున్న 53 లక్షల కుటుంబాల బిల్లుల మొత్తాన్ని ప్రభుత్వం డిస్కంలకు చెల్లిస్తోందని, అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు అవసరమైన సుమారు రూ.14 వేల కోట్ల సబ్సిడీని కూడా ప్రభుత్వం నేరుగా విడుదల చేస్తోందని వెల్లడించారు. విద్యుత్ వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే లైన్‌మెన్లు, ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.1.20 కోట్ల బీమా సౌకర్యం కల్పించామని, సురక్షితంగా పనిచేసేందుకు అవసరమైన భద్రతా పరికరాలు, యూనిఫారాలు అందించామని చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత ఆధునికంగా, ప్రజలకు మరింత చేరువగా తీర్చిదిద్దేందుకు అన్ని స్థాయిల్లో సంస్కరణలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# ఎల్‌నినోపై నిపుణుల కమిటీ తొలి సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

మార్క్‌ఫెడ్, ఆయిల్‌ఫెడ్, జాతీయ విత్తన సంస్థ, తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలు, పరిశోధనా సంస్థలకు చెందిన నిపుణులు సభ్యులుగా ఉన్నారు.
సమావేశంలో డాక్టర్ జి. చిన్నారెడ్డి మాట్లాడుతూ, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో తెలంగాణలో అసాధారణ వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. గత ఆరు నెలలుగా ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని అంచనాలు వచ్చినప్పటికీ, రాష్ట్రానికి సాధారణ వర్షాలు కురుస్తాయని చాలామంది భావించారని చెప్పారు. అయితే జూన్ 1 నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 శాతం వర్షపాతం లోటు నమోదైందని, 10 జిల్లాల్లో సాధారణ వర్షాలు కురవగా, 23 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని వివరించారు. ఎల్‌నినో శాస్త్రీయ నేపథ్యాన్ని వివరిస్తూ, మధ్య, తూర్పు ప్రశాంత మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు వరుసగా అనేక నెలల పాటు సాధారణ స్థాయి కంటే కనీసం అర డిగ్రీ సెల్సియస్ ఎక్కువగా నమోదైనప్పుడు ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడతాయని చెప్పారు. ఎల్‌నినో-దక్షిణ డోలనం ప్రపంచ వాతావరణ వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపుతుందని, ఎల్‌నినో సమయంలో నైరుతి రుతుపవనాలు బలహీనపడతాయని, లా నినా పరిస్థితుల్లో మాత్రం భారతదేశంలో వర్షపాతం మెరుగుపడుతుందని వివరించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్‌నినో ప్రభావమే రాష్ట్రంలో వర్షాభావానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు.
వర్షాభావం ఉన్న జిల్లాలకు సంబంధించిన జిల్లా, మండలాల వారీ వాతావరణ సమాచారం, వర్షపాతం గణాంకాలు, పంటల సాగు విస్తీర్ణ వివరాలను సేకరించి శాస్త్రీయ విశ్లేషణకు సిద్ధం చేసినట్లు డాక్టర్ చిన్నారెడ్డి తెలిపారు. జూలై 17న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ నిపుణుల కమిటీని ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. పరిస్థితులకు అనుగుణంగా తక్షణ నివారణ చర్యలు, దీర్ఘకాలిక అనుసరణ చర్యలపై ప్రభుత్వం నిర్ణయాలు తీసుకునేందుకు కమిటీ సిఫార్సులు ఉపయోగపడతాయని చెప్పారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటే చివరికి మానవ జీవితంపైనే తీవ్ర ప్రభావం పడుతుందని డాక్టర్ చిన్నారెడ్డి అన్నారు. ప్రకృతి వనరులను బాధ్యతాయుతంగా వినియోగించడం, నీరు, విద్యుత్‌ను పొదుపుగా ఉపయోగించడం, ప్రజల్లో అవగాహన పెంపొందించడం, సమాజ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం అత్యంత అవసరమని సూచించారు. శాస్త్రీయ విశ్లేషణ, సమన్వయంతో కూడిన పాలన, సమిష్టి కృషి ద్వారా ఎల్‌నినో వంటి వాతావరణ సవాళ్లను తెలంగాణ సమర్థంగా ఎదుర్కొంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# విద్యార్థులపై లాఠీచార్జ్ ఖండన

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థినులను రోడ్లపై పరుగులు పెట్టించి రక్తం వచ్చేలా కొట్టడం అత్యంత అమానుషమని కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే భారత్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థులతో ఇలాంటి వ్యవహారం చేయడం దేశ ప్రతిష్ఠను దెబ్బతీసిందని విమర్శించారు. ఈ ఘటనతో ప్రపంచ దేశాల ముందు భారత్ తలదించుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.
నీట్ పరీక్షను సక్రమంగా నిర్వహించలేకపోయిన కేంద్ర ప్రభుత్వం విద్యార్థులపై జులుం ప్రదర్శించిందని ఆమె ఆరోపించారు. ప్రశ్నపత్రం లీకేజీ కారణంగా 25 లక్షల మంది విద్యార్థులు నష్టపోయారని, 21 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. ఈ ఘటనలకు బాధ్యత ఎవరు వహిస్తారని, విద్యార్థుల మరణాలకు ఎవరు సమాధానం చెబుతారని ప్రశ్నించారు. విద్యార్థులపై పోలీసుల దాష్టీకాన్ని చూసి దేశం మొత్తం నిశ్చేష్టంగా మారిందని కల్వకుంట్ల కవిత అన్నారు. విద్యార్థులపై విరిగిన ప్రతి లాఠీకి, వారు చిందించిన ప్రతి రక్తపు చుక్కకు దేశ ప్రజలు ఓటు రూపంలో సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు. విద్యార్థుల పట్ల ఇలాంటి వైఖరిని ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని అన్నారు.
నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి బాధ్యులైన వారిని వెంటనే గుర్తించి అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రాణాలు కోల్పోయిన 21 మంది విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. అలాగే విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా నిరాహార దీక్ష చేస్తున్న సోనం వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై కేంద్ర ప్రభుత్వం ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులే దేశ భవిష్యత్తుకు పునాదని, వారిని రక్షించడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని కల్వకుంట్ల కవిత అన్నారు. విద్యార్థుల సమస్యలను బలప్రయోగంతో అణచివేయకుండా, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల ఆకాంక్షలను గౌరవించే విధంగా పాలన సాగించాలని సూచించారు.




# విద్యార్థులతో మంత్రి ముఖాముఖి

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.
ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, సంక్షేమ హాస్టళ్లలో అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ విద్యాభివృద్ధికి అనుకూల వాతావరణాన్ని సృష్టించేందుకు కట్టుబడి ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, విద్యార్థులు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి వారి అభిప్రాయాలను తెలుసుకుని పలు అంశాలపై చర్చించారు.
విద్యార్థుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పాల్గొన్న నాయకులు అభిప్రాయపడ్డారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో యువతకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు బలోపేతమే రాష్ట్ర అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

## వర్షాకాలంలో కలుషిత నీటికి అడ్డుకట్ట వేయాలి



- **వాటర్ సప్లై సిబ్బందికి మున్సిపల్ చైర్మన్ ఆదేశాలు**

**జమ్మికుంట టౌన్ జూలై 22 (తెలంగాణ ముచ్చట్లు):** వర్షాకాలంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జమ్మికుంట మున్సిపల్ వాటర్ సప్లై సిబ్బందికి మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన వాటర్ సప్లై సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు.

పట్టణంలోని 30 వార్డుల్లో తాగునీటి పైప్‌లైన్లను క్షేత్రస్థాయిలో పూర్తిగా పరిశీలించి, ఎక్కడైనా లీకేజీలు ఉన్నట్లయితే వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. వర్షాకాలంలో పైప్‌లైన్ లీకేజీల కారణంగా కలుషిత నీరు సరఫరా అయ్యే ప్రమాదం ఉందని, దీనివల్ల ప్రజలు నీటి ద్వారా వ్యాపించే వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా, ప్రతి వార్డుకు నాణ్యమైన తాగునీరు అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని చైర్మన్ కోరారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, మేనేజర్ జి. రాజిరెడ్డి, వాటర్ సప్లై సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలతో మాజీ ఎంపీ వినోద్ కుమార్ జన్మదినోత్సవం



**జమ్మికుంట టౌన్ జూలై 22 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ జన్మదిన వేడుకలను బుధవారం బీఆర్ఎస్వి జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు కొమ్ము నరేష్ ఆధ్వర్యంలో జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మారుతి నగర్‌లో ఉన్న శ్రీ సత్యసాయి మానసిక వికలాంగుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా మాజీ ఎంపీ వినోద్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేసి వారితో ఆప్యాయంగా మమేకమయ్యారు.

ఈ సందర్భంగా కొమ్ము నరేష్, 8వ వార్డు కౌన్సిలర్ కొలుగూరి సురేష్, జవాజి అనిల్ మాట్లాడుతూ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కలిసి కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ప్రజాసేవకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తూ సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన జన్మదిన వేడుకలను ప్రత్యేక అవసరాలున్న చిన్నారుల మధ్య నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.

పాఠశాల నిర్వాహకులు సూత్రం బుచ్చిరాములు మాట్లాడుతూ, విద్యార్థుల మధ్య జన్మదిన వేడుకలు నిర్వహించి ఆనందాన్ని పంచిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు విద్యార్థులకు ఉత్సాహాన్ని, సమాజానికి స్ఫూర్తిని అందిస్తాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వి నాయకులు చింతల కౌశిక్, శ్రీనివాస్, గురుకుంట్ల మధుకర్, మేకల రవీందర్, శివకుమార్, సన్నీ, సంపత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటల సాగుతో నష్టాలను నివారించండి



- **ఏఈఓ కృష్ణయ్య**

**పెద్దమందడి,జులై22(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లి గ్రామంలో బుధవారం రైతులకు ఏఈఓ కృష్ణయ్య అవగాహన సమావేశం నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశంలో ఏఈఓ కృష్ణయ్య పాల్గొని రైతులకు పంటల ఎంపికపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎల్‌నినో ప్రభావం కారణంగా రానున్న రెండు నెలల పాటు వర్షపాతం ఆశించిన స్థాయిలో ఉండే అవకాశం లేదని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని సూచించారు.తక్కువ నీటితో సాగయ్యే జొన్న, కందులు, ఆముదం, మినుములు, పెసర్లు, అలసందలు, ఉలవలు వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం వల్ల నష్టాలను తగ్గించుకోవచ్చని చెప్పారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా రైతులు మెరుగైన దిగుబడులు, ఆదాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు.వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ శాస్త్రీయ విధానంలో సాగు చేపట్టాలని రైతులకు జి. కృష్ణయ్య సూచించారు. సమావేశంలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని పంటల సాగుకు సంబంధించిన పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# వేలేరు మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా – ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వేలేరు, జూలై 22 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు గండి రామారం ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేసి గోదావరి జలాలను తీసుకువచ్చి రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించే బాధ్యత తనదేనని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.వేలేరు మండలం మద్దెలగూడెం సర్పంచ్ హన్మకొండ మనోజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మద్దెలగూడెంలో రూ.43.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, నూతన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు.

అనంతరం వేలేరు మండల కేంద్రంలో వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి ఆధ్వర్యంలో రూ.45 లక్షల సీసీ రోడ్లు, రూ.22.30 లక్షలతో నిర్మించిన పాఠశాల ప్రహరీ గోడ, రూ.10 లక్షలతో నిర్మించిన వివో భవనాన్ని ప్రారంభించారు.

సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, నెల రోజుల్లో ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయానికి రూ.2.20 కోట్లు, ఎంపీడీవో కార్యాలయానికి రూ.2 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు.

గండి రామారం ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేసి మండలంలోని అన్ని గ్రామాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. వేలేరు-కొమ్ముగుట్ట డబుల్ రోడ్డుకు రూ.8 కోట్లు, వేలేరు-శాలపల్లి బీటీ రోడ్డుకు రూ.4.50 కోట్లు, హ్యామ్ రోడ్ల అభివృద్ధికి రూ.13 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ పనులన్నీ 10 నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు.

మద్దెలగూడెం గ్రామానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని, రెండో విడతలో మరో 20 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించారు. పీచర-కొమ్ముగుట్ట బీటీ రోడ్డును రూ.3 కోట్లతో అభివృద్ధి చేసి ఆరు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు.

రైతులు ఎల్‌నీనో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

రాజకీయ అంశాలపై స్పందిస్తూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలతో రైతులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఆశీర్వాదం అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సర్పంచులు బిల్లా యాదగిరి,లక్ష్మణ్ నాయక్, సద్దాం హుస్సేన్,హన్మకొండ మనోజ్, తహసీల్దార్, ఎంపీడీవో, హౌసింగ్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ వనపర్తిలో కాంగ్రెస్ భారీ ఆందోళన



**వనపర్తి,జూలై22(తెలంగాణ ముచ్చట్లు):** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ), తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) పిలుపు మేరకు బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.రాజకీయ కక్షసాధింపుతో ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, ప్రజాస్వామ్యంలో విభిన్న అభిప్రాయాలను అణచివేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై పోరాడుతున్న రాహుల్ గాంధీని భయపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

అనంతరం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వనపర్తి రాజీవ్ చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తిరుపతయ్య, బ్రహ్మంచారి, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కదిరే రాములు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, మార్కెట్ యార్డ్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, పెద్దమందడి మండలాధ్యక్షుడు వెంకటస్వామి, గోపాల్పేట మండలాధ్యక్షుడు నరహరి, కౌన్సిలర్లు, మైనార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యార్థుల అభ్యాసన నైపుణ్యాల పెంపులో ఉపాధ్యాయులదే కీలక పాత్ర

- **జిల్లా విద్యాధికారి యాదయ్య**



**పెద్దమందడి,జూలై22(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం బలిజపల్లి-జంగమాయపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మూడు రోజుల ప్రాథమిక, గణిత ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు జిల్లా విద్యాధికారి యాదయ్య శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి పర్యవేక్షణ అధికారి మహానంది, శిక్షణ బాధ్యతల అధికారి రాజేష్, మండల విద్యాధికారి ఎస్. మంజులతతో కలిసి శిక్షణ తరగతులను సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి యాదయ్య మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యాసన నైపుణ్యాల పెంపులో ఉపాధ్యాయులదే అత్యంత కీలక పాత్ర అని అన్నారు. నాణ్యమైన బోధన, నిరంతర పర్యవేక్షణ, ప్రతి విద్యార్థి నేర్చుకునే స్థాయిని గుర్తించి అందుకు అనుగుణంగా బోధించడం వల్లనే జిల్లా విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు.రెండో తరగతి విద్యార్థుల ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానంలో జిల్లా రాష్ట్రంలో మూడో స్థానంలో నిలవడం ఉపాధ్యాయుల అంకితభావం, కృషికి నిదర్శనమని కొనియాడారు. ఈ విజయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతాయుతంగా పనిచేసి జిల్లాను రాష్ట్రంలోనే తొలి స్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయాలని, విద్యార్థుల్లో చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, గణన నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక బోధన అందించడం ద్వారా ప్రతి విద్యార్థి లక్ష్యాలను చేరుకునేలా కృషి చేయాలని అన్నారు. అనంతరం పాఠశాల ఆవరణ, విజ్ఞాన ప్రయోగశాల, పాఠశాల తోటను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి పర్యవేక్షణ అధికారి మహానంది, శిక్షణ బాధ్యతల అధికారి రాజేష్, మండల విద్యాధికారి ఎస్. మంజులత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యల సాధనకు ఆగస్టు ఒకటిన మహాధర్నా



- **పోస్టర్ ఆవిష్కరించిన మండల విద్యాధికారి మంజులత**

**పెద్దమందడి,జూలై22(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం పిలుపు మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు ఒకటిన నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం పెద్దమందడి మండలంలోని బలిజేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి మంజులత చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శశివర్ధన్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులను మానసిక ఆవేదనకు గురిచేస్తున్న సమస్యలు వెంటనే పరిష్కారం కావాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం సంఘాలకతీతంగా ప్రతి ఉద్యోగి, ఉపాధ్యాయుడు మహాధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఐక్యతతో ఉద్యమించినప్పుడే న్యాయమైన డిమాండ్లు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు.రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వరప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల ఆర్థిక, సేవా సంబంధిత సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ఈ మహాధర్నాకు అన్ని ఉపాధ్యాయ సంఘాలు సంఘీభావం ప్రకటించి విజయవంతం చేయాలని కోరారు. ఉపాధ్యాయుల హక్కుల సాధనలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని ఆయన అన్నారు.మండల విద్యాధికారి మంజులత మాట్లాడుతూ, ఉపాధ్యాయులు విద్యా ప్రమాణాల పెంపుతో పాటు తమ సమస్యలను ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం కూడా అవసరమేనని అన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం సీనియర్ సభ్యుడు భాస్కర్, పెద్దమందడి మండల శాఖ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, సంఘం ప్రాథమిక సభ్యులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## బాలికల ఆరోగ్య రక్షణకు హెచ్‌పీవీ టీకాలు



**పెద్దమందడి,జూలై22(తెలంగాణ ముచ్చట్లు):** బాలికల్లో భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) ప్రమాదాన్ని తగ్గించేందుకు హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిల్లోమా వైరస్) వ్యాక్సిన్ ఎంతో ఉపయోగకరమని వైద్యులు తెలిపారు.బుధవారం పెద్దమందడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మదిగట్ల సబ్‌సెంటర్‌కు చెందిన జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 14 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ టీకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మంజుల, డాక్టర్ సావని పాల్గొని వ్యాక్సిన్ ప్రాధాన్యంపై విద్యార్థినులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.హ్యూమన్ పాపిల్లోమా వైరస్ వల్ల కలిగే ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పించడంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ సమర్థవంతంగా పనిచేస్తుందని, ముఖ్యంగా భవిష్యత్తులో సర్వైకల్ క్యాన్సర్ వచ్చే అవకాశాలను గణనీయంగా తగ్గిస్తుందని వైద్యులు వివరించారు. చిన్న వయస్సులోనే ఈ టీకా తీసుకోవడం ద్వారా మెరుగైన రోగనిరోధక శక్తి ఏర్పడుతుందని తెలిపారు.హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై తల్లిదండ్రులు ఎలాంటి అపోహలు, భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, ఇది సురక్షితమైన టీకా అని వైద్యులు స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి బాలికకు ఈ వ్యాక్సిన్ వేయించి వారి ఆరోగ్య పరిరక్షణకు సహకరించాలని తల్లిదండ్రులను కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అర్హులైన బాలికలందరికీ దశలవారీగా హెచ్‌పీవీ టీకాలు అందించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరప్రసాద్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కల్తీ ఎరువుల విక్రయాలపై కఠిన చర్యలు తప్పవు



- పెద్దమందడి ఎస్సై జలంధర్ రెడ్డి

**పెద్దమందడి,జూలై22(తెలంగాణ ముచ్చట్లు):** రైతులకు నాణ్యమైన ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని, కల్తీ డీఏపీ, ఆర్గానిక్ డీఏపీ పేరుతో నకిలీ ఎరువులు, ఇంపోర్టెడ్ డీఏపీ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా ఎరువులు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దమందడి ఎస్సై జలంధర్ రెడ్డి, వ్యవసాయ అధికారులు హెచ్చరించారు.బుధవారం పెద్దమందడి మండల కేంద్రంలో ఫర్టిలైజర్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో అధికారులు పలు కీలక సూచనలు చేశారు. ఎరువుల విక్రయాలు పూర్తిగా ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ (ఎఫ్‌సీఓ) నిబంధనల మేరకు నిర్వహించాలని, ప్రతి డీలర్ స్టాక్ బుక్స్‌ను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయించరాదని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా రైతులకు ఎల్నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటి అవసరమయ్యే పంటల సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా కంది, మినుము, రాగులు, కూరగాయలు, వేరుశనగ, ఆయిల్ పామ్ వంటి పంటలను సాగు చేయాలని రైతులకు సిఫారసు చేయాలని డీలర్లకు సూచించారు.సమావేశంలో వనపర్తి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) ప్రభాకర్ రెడ్డి, పెద్దమందడి ఎస్ఐ జలంధర్ రెడ్డి పాల్గొని డీలర్లకు పలు సూచనలు, సలహాలు అందించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన ఎరువుల విక్రయాలకే ప్రాధాన్యం ఇవ్వాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## హుస్నాబాద్ మహాధర్నాలో ఎల్కతుర్తి బీజేపీ నేతల అరెస్ట్

- పెద్దమందడి ఎస్సై జలంధర్ రెడ్డి

**పెద్దమందడి,జూలై22(తెలంగాణ ముచ్చట్లు):** రైతులకు నాణ్యమైన ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని, కల్తీ డీఏపీ, ఆర్గానిక్ డీఏపీ పేరుతో నకిలీ ఎరువులు, ఇంపోర్టెడ్ డీఏపీ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా ఎరువులు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దమందడి ఎస్సై జలంధర్ రెడ్డి, వ్యవసాయ అధికారులు హెచ్చరించారు.బుధవారం పెద్దమందడి మండల కేంద్రంలో ఫర్టిలైజర్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో అధికారులు పలు కీలక సూచనలు చేశారు. ఎరువుల విక్రయాలు పూర్తిగా ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ (ఎఫ్‌సీఓ) నిబంధనల మేరకు నిర్వహించాలని, ప్రతి డీలర్ స్టాక్ బుక్స్‌ను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయించరాదని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా రైతులకు ఎల్నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటి అవసరమయ్యే పంటల సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా కంది, మినుము, రాగులు, కూరగాయలు, వేరుశనగ, ఆయిల్



పామ్ వంటి పంటలను సాగు చేయాలని రైతులకు సిఫారసు చేయాలని డీలర్లకు సూచించారు.సమావేశంలో వనపర్తి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) ప్రభాకర్ రెడ్డి, పెద్దమందడి ఎస్ఐ జలంధర్ రెడ్డి పాల్గొని డీలర్లకు పలు సూచనలు, సలహాలు అందించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన ఎరువుల విక్రయాలకే ప్రాధాన్యం ఇవ్వాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రాహుల్ గాంధీ ఘటనపై జమ్మికుంటలో కాంగ్రెస్ ఆగ్రహ జ్వాలలు





**జమ్మికుంట టౌన్ జూలై 22 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మలను దహనం చేసి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకుల గొంతును అణచివేయడం, ప్రశ్నించే స్వరాలపై దాడులు చేయడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు ప్రజాస్వామ్యంలో సహజమైనవేనని, అయితే వాటికి హింస, బెదిరింపులు, దాడులు సమాధానం కాదని అన్నారు. ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజల సమస్యలపై నిరంతరం ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీపై జరిగిన దాడిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. ఘటనకు బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో చట్ట పరిపాలన అందరికీ సమానంగా ఉండాలని, ప్రతిపక్ష నాయకుల భద్రతను కూడా ప్రభుత్వం నిర్ధారించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా జరుగుతున్న చర్యలకు వ్యతిరేకంగానే ఈ నిరసన చేపట్టామని తెలిపారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రమేష్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మోలుగూరి సదయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు ఒగ్గు రమేష్, శ్రీపతి స్వర్ణలత, నరేష్, పాతకాల మౌనిక, అనిల్, చందరాజు, ఎగిత సుజాత, అశోక్, మాచర్ల రాజు, యట్ల సునీత, కుతాడి తిరుపతి, ముద్దామల్ల రవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజేశ్వర్ రావు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి దొడ్డె శ్రీకాంత్, సీనియర్ నాయకులు గూడెపు సారంగపాణి, లింగరావు, పూదరి శివకుమార్ గౌడ్, సలీం, మంద అశోక్, ఆడెపు కిరణ్, దొగ్గల భాస్కర్, శ్రీనివాస్, పాత ప్రసాద్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శులు కుమ్మరి శ్యామ్, సజ్జాద్ మొహమ్మద్, సన్నీ, రాజ్‌కుమార్, జఫ్ఫానియా, గుర్రం ప్రవీణ్, చెంచాల శ్రీనివాస్, ఎగ్గని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం వద్ద ఆక్రమణలు తొలగించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు వినతి





**మహబూబ్‌నగర్,జూలై22(తెలంగాణ ముచ్చట్లు):** మహబూబ్నగర్ జిల్లా అడ్డాకుల మండలం బలిధుపల్లి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆర్ఎంబీ రహదారిపై పెరిగిన ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలను తొలగించి ఆక్రమణలను నివారించాలని కోరుతూ బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కళాభవన్‌లో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ సదస్సులో కమిషన్‌కు వినతి పత్రం అందజేశారు.గ్రామానికి చెందిన 5వ వార్డు సభ్యుడు ఆంజనేయులు సమర్పించిన వినతిపత్రంలో, గతంలో దళిత సర్పంచ్ అంబేద్కర్ విగ్రహం ముందు ఉన్న ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలను తొలగించేందుకు ప్రయత్నించగా కొందరు అడ్డుకున్నారని పేర్కొన్నారు. అలాగే 2024 ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా చలివేంద్రం ఏర్పాటు చేసే సమయంలో అంబేద్కర్ సంఘం సభ్యులు, ఎంపీటీసీ, కాలనీవాసులను అడ్డుకుని కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారని, ఈ ఘటనపై అడ్డాకుల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సంబంధిత వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైందని తెలిపారు.అయినప్పటికీ ఇప్పటికీ అంబేద్కర్ విగ్రహం ముందు పెరిగిన ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలను తొలగించకపోవడంతో పాటు అవి రహదారిపైకి విస్తరించి గ్రామస్తులు, ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారులకు వినతులు ఇచ్చినా స్పందన లేకపోవడంతో ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కుల వివక్ష పోరాట సమితి (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బాలరాజ్, టీఆర్పీ పార్టీ దేవరకద్ర ఇన్‌చార్జి మంగరాయి వెంకటేష్, బీఎస్పీ మండల అధ్యక్షుడు ప్రసాద్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, గ్రామస్తులు మోహన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజల అగ్నిధార మహాకవి దాశరథి

- పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు



**వనపర్తి,జూలై22(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజల కన్నీళ్లను అగ్నిధారగా మలిచి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తన కలాన్ని పదునైన ఆయుధంగా మలచిన మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు తెలంగాణ ప్రజల విముక్తి పోరాటానికి చిరస్మరణీయ స్ఫూర్తి అని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు.బుధవారం స్థానిక రేడియంట్ హైస్కూల్‌లో సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో దాశరథి కృష్ణమాచార్యుల 101వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ..పద్యాన్ని ప్రజా చైతన్యానికి, సామాజిక మార్పుకు ఆయుధంగా వినియోగించిన మహోన్నత కవి దాశరథి అని కొనియాడారు. బహుభాషా పండితుడైన ఆయన నిజాం నిరంకుశ పాలనను ధైర్యంగా ఎదిరిస్తూ లాఠీ దెబ్బలు భరించడమే కాకుండా జైలు జీవితాన్ని కూడా అనుభవించారని తెలిపారు. తెలంగాణ నేలపై ఆయనకు ఉన్న అపారమైన ప్రేమ, ప్రజల పట్ల ఉన్న అంకిత భావం ఆయన ప్రతి రచనలో ప్రతిఫలిస్తుందని పేర్కొన్నారు.దాశరథి రచనలు పీడిత ప్రజల ఆవేదనకు, ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలిచాయని, సమాజంలో చైతన్యం నింపే శక్తి ఆయన కవిత్వానికి ఉందన్నారు. నేటి యువత దాశరథి రచనలను అధ్యయనం చేసి ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సాహితీ కళా వేదిక సభ్యులు కందూరు నారాయణ రెడ్డి, బైరోజు చంద్రశేఖర్, దేశి రాములు యాదవ్, బండారు శ్రీనివాస్, మద్దిలేటి, రమేష్‌తో పాటు ఉపాధ్యాయులు శైలజ, నుస్రత్, మైత్రీ, శోభ, కృష్ణవేణి, కల్యాణి, శ్రీదేవి, హేమలత, పుష్పాలత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## తరగతి గది నుంచి విజ్ఞాన లోకంలోకి...





- జిల్లా సైన్స్ మ్యూజియంలో శ్రీ గ్లోబల్ హైస్కూల్ విద్యార్థుల విద్యా విహారం

**ఖమ్మం బ్యూరో, జులై 23,(తెలంగాణ ముచ్చట్లు ):** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించి, పుస్తకాలలోని సిద్ధాంతాలకు ఆచరణాత్మక అనుభవాన్ని జోడించే లక్ష్యంతో శ్రీ గ్లోబల్ హైస్కూల్ విద్యార్థులు జిల్లా సైన్స్ మ్యూజియాన్ని సందర్శించారు. ఈ విద్యా విహారం విద్యార్థులకు కొత్త అనుభూతిని కలిగించడమే కాకుండా విజ్ఞానంపై మరింత ఆసక్తిని పెంచింది. తరగతి గది నాలుగు గోడల మధ్య పాఠాలు నేర్చుకునే విద్యార్థులు, నేరుగా విజ్ఞాన ప్రపంచంలోకి అడుగుపెట్టి సైన్స్ అద్భుతాలను స్వయంగా పరిశీలించి ఆనందించారు. మ్యూజియంలో ఏర్పాటు చేసిన శాస్త్రీయ నమూనాలు, ప్రయోగాలు, విజ్ఞాన ప్రదర్శనలు వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా జిల్లా సైన్స్ మ్యూజియం ఇన్‌చార్జ్ డీఎస్ఓ ఈ. వెంకటేశ్వర్లు విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించి, మ్యూజియంలోని వివిధ శాస్త్ర నమూనాల పనితీరు, వాటి వెనుక ఉన్న శాస్త్రీయ సూత్రాలను సరళంగా వివరించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ విజ్ఞానాన్ని ఆసక్తికరంగా అందించారు. మ్యూజియంలో విద్యార్థులు ముఖ్యంగా మానవ కన్ను (హ్యూమన్ ఐ) నిర్మాణం, ఉత్తల , అవతల అద్దాల పనితీరు, బ్లాక్ హోల్ ,భావన, బెర్నౌలి సూత్రం , అలాగే గతిశక్తి మరియు స్థితిశక్తి వంటి శాస్త్రీయ అంశాలను ప్రత్యక్ష నమూనాల ద్వారా తెలుసుకున్నారు.

ఈ విద్యా పర్యటనలో పాఠశాల ఫిజికల్ సైన్స్, బయాలజీ ఉపాధ్యాయులు విద్యార్థులకు వివిధ నమూనాలపై అవగాహన కల్పించారు. ఈ విద్యా విహారం ద్వారా విద్యార్థుల్లో పరిశీలనా నైపుణ్యం, శాస్త్రీయ ఆలోచనా విధానం, విజ్ఞానంపై ఆసక్తి మరింత పెరిగిందని పాఠశాల యాజమాన్యం అయినా ఇనుకుల్ల దివాకర్ రెడ్డి, వాహిని, సుధాకర్ రెడ్డి, తిరుపతి రెడ్డి మరియు పాఠశాల ప్రిన్సిపల్ తన్నీరు రామారావు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తెలపడం జరిగింది. విద్యార్థులు కూడా ఈ పర్యటన తమకు మరపురాని అనుభవంగా నిలిచిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ సైన్స్ మరియు బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయులు అయిన ఎస్. పవన్ కుమార్, ఎన్, కృష్ణ మరియు సలీం మొదలగు వారు పాల్గొన్నారు.



## గడ్డి వాము దగ్ధం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

**వేలేరు, జూలై 22 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల కేంద్రానికి చెందిన సూత్రపు సంపత్, తిరుపతిలు తమ వ్యవసాయ బావి వద్ద పాడి పశువుల కోసం నిల్వ ఉంచిన సుమారు 500 గడ్డి కట్టలు అగ్నికి ఆహుతయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు, అదే గ్రామానికి చెందిన బంక శ్రీనివాస్ పాత కక్షల నేపథ్యంలో గడ్డి వాముకు నిప్పంటించినట్లు ఆరోపణలు రావడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు వేలేరు పోలీసులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.



## ధూప దీప నైవేద్య అర్చక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా అన్నావజ్జల ప్రసాద్ శర్మ ఎన్నిక

**ఖమ్మం బ్యూరో , జూలై 21(తెలంగాణ ముచ్చట్లు ):**తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఖమ్మం జిల్లాకు చెందిన అన్నావజ్జల ప్రసాద్ శర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం ఆవిర్భావ మహాసభ మంగళవారం హైదరాబాద్‌లోని సారస్వత పరిషత్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించబడింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 500 మంది ధూప దీప నైవేద్య అర్చకులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన వెంగళం సంతోష్ శాస్త్రి, కోశాధికారిగా మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గాండ్ల రవికుమార్, గౌరవ అధ్యక్షుడిగా గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన శ్రీరంగం గోపి కృష్ణమాచార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కరీంనగర్ జిల్లాకు చెందిన తిరునగరి వెంకటాద్రి స్వామి, ఉపాధ్యక్షుడిగా కామారెడ్డి జిల్లాకు చెందిన మాలో రమేష్ మహారాజ్ ఎన్నికయ్యారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ అర్చక జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ సంఘం లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధూప దీప నైవేద్య అర్చకులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని, వారిని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకువచ్చి 99 పీఆర్సీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

నూతన రాష్ట్ర అధ్యక్షుడు అన్నావజ్జల ప్రసాద్ శర్మ మాట్లాడుతూ తెలంగాణలో ధూప దీప నైవేద్య అర్చకుల జీవన పరిస్థితులు అత్యంత క్లిష్టంగా ఉన్నాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని అనేక దేవాలయాలు రాజకీయ ప్రభావానికి లోనవుతున్న నేపథ్యంలో అర్చకులకు ఉద్యోగ భద్రత అత్యవసరమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ధూప దీప నైవేద్య అర్చకులను సంఘటితం చేసి వారి సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.

అదేవిధంగా రాష్ట్రంలోని అన్ని మండలాల్లో సంఘం ప్రతినిధులు పర్యటించి అర్చకుల నుంచి వినతిపత్రాలు సేకరించి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు రాష్ట్ర మంత్రులందరికీ అందజేసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమానికి హాజరైన అర్చకులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ధూప దీప నైవేద్య అర్చక సంఘం అధ్యక్షుడు మునగలేటి రమేష్ శర్మ, జిల్లా కార్యదర్శి మరింగంటి భార్గవాచార్యులు పాల్గొని రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన అన్నావజ్జల ప్రసాద్ శర్మకు అభినందనలు తెలిపారు.

## చింతకాని మండలంలో ఓటరు నమోదు పై సమీక్ష సమావేశాలు



**ఖమ్మం బ్యూరో , జూలై 22(తెలంగాణ ముచ్చట్లు ):** చింతకాని మండలంలోని గాంధీనగర్, బొప్పారం గ్రామాల్లో ఓటరు నమోదు ప్రక్రియపై సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు పార్టీ జిల్లా నాయకుడు మంకెన రమేష్ హాజరై మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా గ్రామస్థాయిలో ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కొత్తగా అర్హత పొందిన వారు, ఇప్పటి వరకు పేరు నమోదు కాని వారు ఎవరూ మిగలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలందరూ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు అయ్యేలా అవగాహన కల్పించాలని అన్నారు.

మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేయాలని, గ్రామస్థాయిలో పనిచేసే బాధ్యులకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బొడ్డు వెంకటరామారావు, బొప్పారం గ్రామ సర్పంచ్ రహీముతుల్లా, మాజీ సర్పంచ్ ఎస్.కే. సిలార్ సాబ్, కాలింగ్ డేవిడ్, తునికిపాటి పూర్ణచంద్రరావు, గ్రామ శాఖ అధ్యక్షుడు మాజీ చెలికేసి వెంకటేశ్వర్లు, బత్తుల కొండలు, మేకల ప్రసాద్, గురుజాల సంజీవరావు, చలవాది లక్ష్మణ్, లింగం అశోక్, ఎస్.కే. జావిద్, యాదా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# మోదీ నిరంకుశత్వానికి రాహుల్ గాంధీ అరెస్టే నిదర్శనం

- **తుంబూరు దయాకర్ రెడ్డి**
- **విద్యార్థుల, నిరుద్యోగుల భవిష్యత్తుతో కేంద్రప్రభుత్వం చెలగాటమాడుతుందనిమండిపాటు**
- **కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ప్రధాని మోదీ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్**
- **ఏదులాపురంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం**



**ఖమ్మం బ్యూరో, జులై 21(తెలంగాణ ముచ్చట్లు):** పోటీ పరీక్షల లీకేజీలతో దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల, నిరుద్యోగ యువత జీవితాలను నాశనం చేస్తూ, వారి తరఫున ప్రశ్నిస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అక్రమంగా అదుపులోకి తీసుకోవడం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసినందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రాహుల్ గాంధీ అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. సత్యనారాయణపురం రాంలీలా ఫంక్షన్ హాల్ నుండి ప్రధాన వీధుల గుండా ప్రదర్శనగా వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా తుంబూరు దయాకర్ రెడ్డి మాట్లాడుతూ... పేపర్ లీకేజీల వల్ల కష్టపడి చదివిన విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుంటే కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. బాధితుల పక్షాన నిలబడి న్యాయం చేయాలని ఆందోళన చేసిన రాహుల్ గాంధీపై పోలీసులు బలప్రయోగానికి దిగడం సిగ్గుచేటన్నారు. తక్షణమే ప్రధాని నరేంద్ర మోదీ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని పట్టుబట్టారు.

అరెస్టులకు, అక్రమ కేసులకు కాంగ్రెస్ శ్రేణులు భయపడేది లేదని, విద్యార్థులు, నిరుద్యోగుల హక్కుల సాధన కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ఖమ్మం రూరల్ మండల, ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సకల సౌకర్యాలతో మండల కార్యాలయాల సముదాయం నిర్మాణానికి ప్రణాళికలు..

- **జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**ఖమ్మం బ్యూరో, జూలై 22(తెలంగాణ ముచ్చట్లు ):**ప్రజలకు అందుబాటులో ఒకే ప్రాంగణంలో అన్ని ప్రభుత్వ శాఖలు, సకల సౌకర్యాలతో మండల కార్యాలయాల సముదాయ భవన నిర్మాణానికి ప్రణాళిక తయారు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.

కల్లూర్ సబ్ కలెక్టర్ కార్యాలయం నందు బుధవారం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి నూతనంగా నిర్మించనున్న సమీకృత మండల కార్యాలయ సముదాయ నిర్మాణం పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు.

సమీకృత మండల కార్యాలయ సముదాయ భవనాల నిర్మాణ మ్యాప్ లను పరిశీలించిన కలెక్టర్ ఆర్ అండ్ బీ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ కల్లూరు మండల స్థాయిలో ప్రజల సౌకర్యార్థం అన్ని కార్యాలయాలు ఒకే చోట అన్ని వసతులతో ఉండే విధంగా నిర్మించాలని, దీనికి తగిన విధంగా ప్రణాళికలు, భవనాలు, కావాలసిన వసతుల డిజైన్ తయారు చేయాలని అన్నారు. మండల స్థాయిలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, వ్యవసాయ, ఉద్యానవన, విద్యుత్, విద్యాశాఖ, శిశు సంక్షేమం, రిజిస్ట్రేషన్, రోడ్లు & భవనాలు, నీటిపారుదల, మిషన్ భగీరథ తదితర శాఖల కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో పనిచేయనున్నాయి. దీంతో ప్రజలు ఒక పని కోసం పలుచోట్ల తిరగాల్సిన అవసరం లేకుండా అన్ని ప్రభుత్వ సేవలను ఒకేచోట పొందే అవకాశం కలుగుతుందన్నారు.

అంతస్తుల వారీగా కార్యాలయాల ఏర్పాటు చేసి విశాలమైన కాన్ఫరెన్స్ హాల్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, విశాలమైన సమావేశ మందిరాలు, ఆధునిక కార్యాలయ గదులు, ప్రజల కోసం వేచిచూడే హాల్స్, పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, దివ్యాంగులకు అనుకూల ర్యాంపులు, లిఫ్ట్ తదితర ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని శాఖలు ఒకే ప్రాంగణంలో పనిచేయడం వల్ల ప్రభుత్వ అధికారుల మధ్య సమన్వయం మెరుగుపడి, ఫైళ్ల పరిష్కారం వేగవంతం కానుందని కలెక్టర్ తెలిపారు.

ఈ సమీకృత మండల కార్యాలయ సముదాయం నిర్మాణం పూర్తయిన అనంతరం మండల ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కానున్నాయి. ప్రజల సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు పారదర్శకమైన, సమర్థవంతమైన పరిపాలన అందుబాటులోకి వస్తుంది. ప్రభుత్వ సేవల నాణ్యతను పెంచుతూ, ప్రజాకేంద్రిత పరిపాలనకు ఈ ప్రాజెక్టు ఆదర్శంగా నిలవనుందని ధీమా వ్యక్తం చేశారు.

మండల కార్యాలయం నిర్మించిన తర్వాత నిర్వహణ కూడా సక్రమంగా జరిగేలా ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. అంతర్గంగా రోడ్డు వేసేలా ప్లాన్ చేసుకోవాలని అన్నారు. ఫైర్ సేఫ్టీ సూచనలు పాటిస్తూ నిర్మాణాలు జరగాలని అన్నారు.

మండల కార్యాలయ సముదాయం అవసరమైన విద్యుత్ సోలార్ ప్యానెల్ ఏర్పాటు సమకూర్చుకునేలా ప్లాన్ లో భాగస్వామ్యం చేయాలని అన్నారు. సమీకృత మండల కార్యాలయ సముదాయం వద్ద అవసరమైన పార్కింగ్ సౌకర్యం ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా త్రాగు నీటి సరఫరా కనెక్షన్ తీసుకోవాలని అన్నారు. ప్రతి ఫ్లోర్ లో ప్రజల వెయిటింగ్ ఏరియా ఉండాలని, అక్కడ త్రాగు నీటి ట్యాప్ ఉండాలని అన్నారు. కార్యాలయాల్లో ఫైల్స్ పెట్టెందుకు స్టోరేజ్ అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్&బీ ఎస్ఇ యుగేందర్ రావు, హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, డిఇ భగవాన్, ఏఇ కోటేశ్వరరావు, పిఆర్ డిఈ రాంబాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారితో ఖమ్మం అభివృద్ధి

- **మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**
- **ఆగస్టు 1 నుంచి ఖమ్మం నగర ట్రాఫిక్‌కు భారీ ఉపశమనం**
- **దంసలాపురం గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి ఆర్ఓబీ పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**ఖమ్మం బ్యూరో, జులై 22(తెలంగాణ ముచ్చట్లు):** గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పూర్తయితే ఖమ్మం జిల్లా అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని ఆగస్టు 1 నుంచి ఖమ్మం వైరా సత్తుపల్లి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య గణనీయంగా తగ్గుతుందని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ సహకార చేనేత జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి దంసలాపురం వద్ద గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) పనుల పురోగతిని పరిశీలించారు. అనంతరం అధికారులు ప్రజా ప్రతినిధులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి అసలు ప్రణాళికలో దంసలాపురం వద్ద ఎగ్జిట్ లేకపోయినా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దంసలాపురం కల్లూరు సత్తుపల్లి వద్ద ప్రత్యేక ఎగ్జిట్లు తీసుకొచ్చామని తెలిపారు. దంసలాపురం ఎగ్జిట్ రైల్వే వంతెన ఆధారంగా నిర్మించబడిందన్నారు.

ఆగస్టు 1వ తేదీ నుంచి ఈ రహదారిపై వాహనాల రాకపోకలు ప్రారంభమైతే ఖమ్మం వైరా సత్తుపల్లి ప్రధాన పట్టణాల్లో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. ఏలూరు తూర్పు గోదావరి పశ్చిమ గోదావరి వైపు వెళ్లే దాదాపు 90 శాతం వాహనాలు ఈ జాతీయ రహదారినే వినియోగిస్తాయని తెలిపారు. ప్రజలకు ఈ విషయంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి భవిష్యత్తులో పరిశ్రమలు వాణిజ్యం ఉపాధి అవకాశా లకు పెద్ద ఎత్తున దోహదపడుతుందని పేర్కొన్నారు .ఈ రహదారి ద్వారా రాజమండ్రికి కేవలం రెండు గంటల్లో చేరుకోవచ్చని తెలిపారు. యాక్సెస్ కంట్రోల్డ్ హైవే కావడంతో జంతువులు ఆటోలు అనధికార క్రాసింగ్‌లు వంటి అంతరాయాలు లేకుండా సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందన్నారు. అమరావతి నుంచి భద్రాచలం మీదుగా జగదల్‌పూర్ వరకు నాలుగు లైన్ల జాతీయ రహదారి ప్రతిపాదన ఉందని తెలిపారు. మణుగూరు నుంచి ఏటూరునాగారం మీదుగా నాగపూర్ వెళ్లే జాతీయ రహదారి కూడా రానుందని చెప్పారు. కరీంనగర్- వరంగల్ నుంచి అమరావతికి వెళ్లే రహదారి పనులు కొనసాగుతున్నాయని భూసేకరణ సమస్యలు ఉన్న ప్రాంతాల్లో మాత్రమే ఆలస్యం జరుగుతోందన్నారు.

ఖమ్మం-అశ్వారావుపేట రహదారిని జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కి అప్పగించామని నాలుగు లైన్ల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని వెంటనే డీపీఆర్ సిద్ధం చేసి కేంద్రానికి పంపాలని అధికారులను ఆదేశించారు.ఖమ్మం ప్రవేశం నుంచి అశ్వారావుపేట వరకు ఎన్‌హెచ్ఏఐ నిబంధనల ప్రకారం మార్కింగ్ పూర్తి చేసి రహదారి పక్కన ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని సూచించారు. తాను మంత్రి అయినప్పుడు ఖమ్మం జిల్లాలో ఒక్క సెంటీమీటర్ జాతీయ రహదారి కూడా లేదని ప్రస్తుతం అన్ని దిశల్లో జాతీయ రహదారులు అభివృద్ధి చెందడం జిల్లాకు గర్వకారణమని అన్నారు. సమన్వయంతో అమరావతి రహదారికి సంబంధించిన సమస్యలను పరిష్కరించి జిల్లా పరిధిలో పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. కామాంచికల్ మీదుగా ఇల్లెందు క్రాస్ రోడ్డును పొన్నెకల్ నుంచి అమరావతి రహదారికి రూ.120 కోట్లతో అనుసంధానం చేస్తున్నామని ఆ రహదారి పూర్తయితే ఇల్లెందు వైరా ప్రాంతాల ప్రజలు ఖమ్మం నగరంలోకి రాకుండానే తమ గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

జాతీయ రహదారుల అనుసంధానంతో ఖమ్మం నగరానికి ఔటర్ రింగ్ రోడ్ తరహా వ్యవస్థ ఏర్పడిందని మంత్రి పేర్కొన్నారు. రోడ్లు భవనాల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ప్రత్యేక ఔటర్ రింగ్ రోడ్ ఏర్పాటు చేయాలని ప్రయత్నించినా నిధుల కొరతతో సాధ్యం కాలేదని ఇప్పుడు జాతీయ రహదారుల ద్వారానే ఆ లక్ష్యం నెరవేరిందన్నారు. ఈ జాతీయ రహదారి ప్రారంభంతో ఖమ్మం నగరం ట్రాఫిక్ రహితంగా మారుతుందని తెలిపారు.జాతీయ రహదారి నిర్మాణం కోసం తమ విలువైన భూములను అందించిన రైతులకు మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సహకారం వల్లే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు వేగంగా పూర్తి దశకు చేరుకుందని జిల్లా అభివృద్ధిలో రైతుల సహకారం చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు.ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు.

జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ఒక మంచి రహదారి ఏ గ్రామానికైనా పట్టణానికైనా వంద రెట్లు అభివృద్ధిని తీసుకువస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ దివ్య ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్ ప్రజా ప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## రోడ్లపై కేజ్ వీల్స్ ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు

- ఏన్కూర్ ఎస్సై సంధ్య

**ఖమ్మం బ్యూరో, జులై 22(తెలంగాణ ముచ్చట్లు ):**రోడ్లపై కేజ్ వీల్స్ అమర్చిన ట్రాక్టర్లను నడపడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏన్కూర్ ఎస్సై సంధ్య తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు కేజ్ వీల్స్ అమర్చి రోడ్లపై తిరిగే ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఏన్కూర్ మండలం, టి.ఎల్.పేట గ్రామ ప్రధాన రహదారిపై ట్రాక్టర్‌కు ఫుల్ వీల్స్ అమర్చి నడపడం వల్ల రోడ్డు తీవ్రంగా దెబ్బతిన్నట్లు గుర్తించి, ఈ ఘటనకు సంబంధించి టి.ఎల్.పేట గ్రామానికి చెందిన కూచిపూడి నరసింహారావు పై ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించినందుకు సంబంధిత చట్టాల ప్రకారం ఏన్కూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. ప్రజల కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి గ్రామాల వరకు మెరుగైన రహదారులను నిర్మిస్తోందని, కాబట్టి వాటిని సురక్షితంగా ఉంచడం, రోడ్డు దెబ్బతినకుండా చూసుకోవడం అందరి బాధ్యతని అన్నారు. వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్లకు కేజ్ వీల్స్ అమర్చడం సాధారణమే అయినప్పటికీ,పొలాల వద్ద పనులు ముగిసిన తర్వాత కేజ్ వీల్స్ తొలగించి సాధారణ టైర్లు వేసుకోవాలి. లేదా రోడ్లకు నష్టం జరగకుండా ప్రత్యామ్నాయాలు వాడాలన్నారు. ట్రాక్టర్ యజమానులు నిబంధనలు పాటించి,ట్రాక్టర్ డ్రైవర్లకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఎవరైనా నిబంధనలుఉల్లంఘిస్తున్నట్లు గుర్తించినా డయల్ -100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులపై బలప్రయోగం ఖండనీయం

### జమాత్-ఎ-ఇస్లామీ హింద్



**ఖమ్మం బ్యూరో,జూలై 20(తెలంగాణ ముచ్చట్లు ):** దేశ విద్యా వ్యవస్థలో కొనసాగుతున్న సమస్యలపై జంతర్ మంతర్ సమీపంలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై పోలీసులు బలప్రయోగానికి పాల్పడ్డారన్న వార్తలను జమాత్‌ఎఇస్లామీ హింద్ (జేఐహెచ్) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు జేఐహెచ్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ సలీం ఇంజనీర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

శాంతియుత నిరసనకారులపై లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం, నిర్బంధం వంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి, రాజ్యాంగం కల్పించిన శాంతియుత నిరసన హక్కుకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను అణచివేయడం కాకుండా, వారితో చర్చలు జరిపి పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, నిష్పక్షపాతత, జవాబుదారీతనం కోసం వేలాది మంది యువత ముందుకు రావడం అభినందనీయమని ప్రొఫెసర్ సలీం ఇంజనీర్ పేర్కొన్నారు. అయితే నిరసనకారులు తమ ఆందోళనను శాంతియుతంగా, అహింసా మార్గంలో కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శాంతియుత ఉద్యమాలకే ప్రజల మద్దతు, నైతిక బలం ఎక్కువగా ఉంటుందని అన్నారు.

నిరసన చేస్తున్న విద్యార్థుల ప్రతినిధులతో కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్చలు ప్రారంభించాలని, పోలీసుల బలప్రయోగంపై నిష్పక్షపాత విచారణ జరిపించాలని, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే పరీక్షల నిర్వహణపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించేలా సమగ్ర విద్యా సంస్కరణలు చేపట్టాలని సూచించారు.

విద్యా న్యాయం రాజకీయాలకు అతీతమైన జాతీయ అంశమని పేర్కొన్న జమాత్‌ఎ ఇస్లామీ హింద్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, పౌర సమాజ సంస్థలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి పూర్తి సంఘీభావం ప్రకటించింది. దేశ భవిష్యత్తు యువతకు విద్యా వ్యవస్థపై ఉన్న విశ్వాసంపైనే ఆధారపడి ఉంటుందని, న్యాయం, పారదర్శకత, జవాబుదారీతనం ఆధారంగా విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.

## పోలీస్ అధికారులకు ప్రతిభ పురష్కారాలు..

- పతకాలు సాధించిన అధికారులను అభినందించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం బ్యూరో, జులై 22(తెలంగాణ ముచ్చట్లు ):**నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర పోలీసు సేవా పతకాలలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అందించిన అత్యుత్తమ సేవలకు గాను పలువురు పోలీస్ సిబ్బందికి పతకాలు లభించాయి. పతకాలు పొందిన వారిలో వైరా ఏసిపి సారంగపాణి, ట్రాఫిక్ ఎస్సై మౌలానా, ఎస్సై అమీర్ ఖాన్, తో పాటు పోలీస్ సిబ్బంది వున్నారు. ఉత్తమ సేవ పతకం (03) సేవ పతకం (07) ఉత్కృష్ట పతకాలు (03) సాధించారు. ఈ నేపథ్యంలో బుధవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతుల మీదుగా 13 మంది పోలీస్ సిబ్బందికి పతకాలు అందజేసి అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సీపీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఆర్ ఐ కామరాజు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలపై 27న “ఛలో పార్లమెంట్”

- జంతర్ మంతర్ వద్ద ఒక రోజు ధర్నా
- పోస్టర్ ఆవిష్కరించిన టీడబ్ల్యూజేఎఫ్




**ఖమ్మం బ్యూరో,జూలై 22(తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన జర్నలిస్టుల సమస్యల పై ఈ నెల 27వ తేదీన "ఛలో పార్లమెంట్" కార్యక్రమం చేపడుతున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు వెల్లడించారు. బుధవారం హైదరాబాద్ హైదర్‌గూడలోని న్యూస్ సర్వీస్ సిండికేట్ (ఎన్ ఎస్ ఎస్) లో జరిగిన మీడియా సమావేశంలో ఫెడరేషన్ అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ లు ఛలో పార్లమెంట్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

జరుతున్నందున దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి, పార్లమెంట్ సభ్యుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించాలని కోరుతూ ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలో పరిష్కరించాల్సిన జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్ ల పునరుద్ధరణ, జర్నలిస్టుల రక్షణకు పార్లమెంట్ లో ప్రత్యేక చట్టం చేయడం, రిటైర్డ్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, జాతీయ మీడియా కమీషన్ ఏర్పాటు, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియాకు చట్టబద్ధత వంటి డిమాండ్ల ను వెంటనే పరిష్కరించాలని కోరారు.ఈ డిమాండ్ల సాధనకై 27న ఢిల్లీలోని పార్లమెంట్ (జంతర్ మంతర్) వద్ద ఒక రోజు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు రైలు ప్రయాణ చార్జీల్లో 50 శాతం రాయితీ కల్పిస్తూ దాదాపు పదిహేనేళ్ళ పాటు కొనసాగిన రైల్వే రాయితీని కేంద్ర ప్రభుత్వం కోవిడ్ సందర్భంగా నిలిపివేసిందని, ఈ సదుపాయాన్ని తిరిగి పునరుద్ధరించకపోవడంతో దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. జర్నలిస్టుల రైల్వే రాయితీ పాసులను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా మీడియా రంగం విస్తరించిన నేపథ్యంలో వివిధ సమస్యలను పరిష్కరించేందుకు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో "నేషనల్ మీడియా కమీషన్" ఏర్పాటు చేయాలని వారు కోరారు. అదే విధంగా వివిధ రాష్ట్రాలలో అనేకమంది రిటైర్డ్, సీనియర్ జర్నలిస్టులకు ఎటువంటి ఆదాయ వనరులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయయని, కొన్ని రాష్ట్రాలలో రిటైర్డ్ జర్నలిస్టులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ స్కీం అమలు చేస్తున్నప్పటికి జాతీయ స్థాయిలో పెన్షన్ స్కీం లేకపోవడం వల్ల మిగతా రాష్ట్రాలలో ఈ స్కీం అమలు కావడంలేదని,అందుకే దేశవ్యాప్తంగా ఒకే పెన్షన్ విధానం ఉండేలా "జాతీయ పెన్షన్ పథకం" అమలు చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అనేక రాష్ట్రాలలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, హత్యలు, అక్రమ కేసులు వంటి వాటిని అరికట్టేందుకు పార్లమెంట్ లో "జర్నలిస్టుల రక్షణ చట్టం" తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలకు పూర్తి స్థాయిలో చట్టబద్ధత కల్పించాలని అన్నారు. అదేవిధంగా పాత్రికేయ సంఘాలకు,

జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలకు ప్రభుత్వ భూముల కేటాయింపును నిరాకరిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించి, దేశవ్యాప్తంగా పాత్రికేయులకు ఇళ్ళస్థలాలు కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్ల సాధనకై 27న జరిగే "ఛలో పార్లమెంట్" కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి జర్నలిస్టులు, టీడబ్ల్యూజేఎఫ్ బాధ్యులు పాల్గొంటారని, అదేవిధంగా ఢిల్లీ, యూపీ తదితర రాష్ట్రాలకు చెందిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) నాయకులు కూడా ధర్నాలో పాల్గొంటారని తెలిపారు. ధర్నా అనంతరం

పలువురు కేంద్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మీడియా సమావేశంలో ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె. పాండురంగారవు, పి. అశోక్ కుమార్ గౌడ్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, రంగారెడ్డి జిల్లా కోకన్వీనర్ నంబి పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీ ఖండిస్తూ కాంగ్రెస్ ధర్నా





**నీట్ లీకేజీకి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: కాంగ్రెస్**

**హుజురాబాద్, జూలై 22(తెలంగాణ ముచ్చట్లు ):** నీట్ పేపర్ లీకేజీ ఘటనను ఖండిస్తూ హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సొల్లు బాబన్న, హనుమాన్ దేవస్థానం చైర్మన్ కొలిపాక శంకర్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులతో పాటు బీసీ జేఏసీ నాయకులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందని అన్నారు. పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించడం వల్ల విద్యార్థులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. విద్యార్థులకు మద్దతుగా వెళ్లిన కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీల అరెస్టు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. విద్యార్థుల హక్కులను కాలరాసే చర్యలను వెంటనే నిలిపివేయాలని, పరీక్షల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం కల్పించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు చందుపట్ల జనార్ధన్, సంధ్యల వెంకన్న, ఇబ్బకాయల సాగర్, ములుగు రాధ, ఎండి కరీమా, కుర్ర శ్రీనివాస్, సుంకరి రాజేందర్, కొత్తగట్టు చక్రపాణి, కొలిపాక సారయ్య, వేల్పుల రత్నం, పొడిసెట్టి వెంకటరాజం, తిప్పారపు భువనచందర్, పోగు సమ్మయ్య, ఎండి రియాజ్ తదితరులు పాల్గొన్నారు.




## హుజురాబాద్‌లో సెంట్రల్ బ్యాంక్ నూతన శాఖ ప్రారంభం

### ప్రజల కోసం కొత్త బ్యాంకు సేవలు

**హుజురాబాద్, జూలై 22(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖను బుధవారం ఘనంగా ప్రారంభించారు. బ్యాంకు జోనల్ హెడ్ ఎం పిచ్చయ్య, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ఒడితల సతీష్ కుమార్ కలిసి నూతన శాఖను ప్రారంభించి సేవలను ప్రారంభించారు. ఈ శాఖ ప్రారంభంతో హుజురాబాద్ పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఆధునిక బ్యాంకింగ్ సేవలు మరింత సులభంగా అందనున్నాయి.

ఈ సందర్భంగా జోనల్ హెడ్ ఎం. పిచ్చయ్య మాట్లాడుతూ, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశంలోనే అత్యంత విశ్వసనీయమైన ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఒకటని అన్నారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన బ్యాంకింగ్ సేవలు అందించడమే బ్యాంకు ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పొదుపు ఖాతాలు, డిపాజిట్ పథకాలు, వ్యవసాయ రుణాలు, వ్యాపార రుణాలు, గృహ రుణాలు, విద్యా రుణాలు, స్వయం ఉపాధి రుణాలు, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్ వంటి అన్ని సేవలను ఒకే చోట అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

తెలంగాణలోని వరంగల్ రీజియన్ పరిధిలో ప్రారంభమైన 44వ శాఖ హుజురాబాద్ శాఖ కావడం సంతోషకరమని ఎం. పిచ్చయ్య పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను విస్తరించేందుకు బ్యాంకు కట్టుబడి ఉందని, ప్రతి వర్గానికి సులభమైన బ్యాంకింగ్ సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ఒడితల సతీష్‌కుమార్ మాట్లాడుతూ, హుజురాబాద్ ప్రాంతంలో సెంట్రల్ బ్యాంక్ శాఖ ప్రారంభం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రైతులు, చిన్న వ్యాపారులు, మహిళా సంఘాలు, యువత, ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు తమ అవసరాలకు అనుగుణంగా బ్యాంకు ద్వారా రుణాలు, ఇతర ఆర్థిక సేవలను పొందాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని సంపాదిస్తూ ఉత్తమ సేవలు అందించాలని బ్యాంకు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు రీజినల్ హెడ్ ఐ. రాజ్‌కుమార్, వ్యాపారవేత్త మల్లారెడ్డి, చీఫ్ మేనేజర్ షేక్ అబ్దుల్, బ్రాంచ్ మేనేజర్ మహేష్, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, స్థానిక ప్రముఖులు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. నూతన శాఖ ప్రారంభం సందర్భంగా ఖాతాదారులకు బ్యాంకు అందిస్తున్న వివిధ పథకాలు, రుణ సదుపాయాలు, డిజిటల్ సేవలపై అధికారులు అవగాహన కల్పించారు. హుజురాబాద్ ప్రాంత ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన బ్యాంకింగ్ సేవలు అందించడంలో ఈ శాఖ కీలక పాత్ర పోషిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.





# విద్యార్థుల కోసం కాంగ్రెస్ గళం.. కరీంనగర్‌లో శాంతియుత ర్యాలీ

**ఢిల్లీ పోలీసుల తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం.. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన**

**కరీంనగర్, జూలై 22(తెలంగాణ ముచ్చ-ట్లు ):** ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఢిల్లీలో విద్యార్థుల సమస్యలపై చేపట్టిన శాంతియుత నిరసన సందర్భంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. నీట్ పరీక్ష వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. గాంధీ విగ్రహం నుంచి కోర్టు చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు జరిగిన ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించడం, బలప్రయోగానికి దిగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని నాయకులు విమర్శించారు. విద్యార్థుల హక్కులను కాపాడాల్సిన కేంద్ర ప్రభుత్వం వారిపై అణచివేతకు పాల్పడడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని, నీట్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన వారిపై పోలీసుల బలప్రయోగాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, *హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వొడితల ప్రణవ్ బాబు, హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు,* కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## వ్యాపార భాగస్వామి వేధింపులు తాళలేక యువకుడు ఆత్మహత్య.. నిందితుడు సురేష్ రిమాండ్‌కు

**వేలేరు, జూలై 22 (తెలంగాణ ముచ్చట్లు ):** హనుమకొండ జిల్లా వేలేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్లకృష్ణపల్లి గ్రామానికి చెందిన ఎడునూరి నరేష్ (29) వ్యాపార భాగస్వామి వేధింపులు, బెదిరింపులు తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న కేసులో నిందితుడు ఎల్. సురేష్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

పోలీసుల వివరాల ప్రకారం, నరేష్ గత రెండేళ్లుగా సురేష్‌తో కలిసి రూ.8 లక్షల పెట్టుబడితో డీజే సౌండ్స్, లైటింగ్, డెకరేషన్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. గత మూడు నెలలుగా వ్యాపార లాభనష్టాల విషయంలో ఇద్దరి మధ్య విభేదాలు నెలకొన్నాయి.

ఈ నెల 9న సురేష్ మరికొందరితో కలిసి నరేష్ అత్తగారి ఇంటికి వెళ్లి, భార్యా పిల్లల ముందే చంపేస్తామని బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో మనస్తాపానికి గురైన నరేష్ ఈ నెల 16న పురుగుల మందు తాగి, తన భార్య అర్చనకు ఫోన్ చేసి విషయం తెలియజేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని హనుమకొండ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరణానికి ముందు రాసిన సూసైడ్ నోట్‌లో తన చావుకు సురేష్ కారణమని నరేష్ పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఎడునూరి అర్చన ఫిర్యాదు మేరకు వేలేరు పోలీసులు BNS సెక్షన్ 109, 351(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు ఎల్. సురేష్‌ను అరెస్ట్ చేసి, బుధవారం రిమాండ్‌కు తరలించారు.

# నీట్ టాపర్ కీలక వ్యాఖ్యలు



- **ప్రజాస్వామ్యంలో నిరసనలు అంతర్భాగమన్న ఆర్యన్ గుప్తా**
- **పరీక్ష రద్దుతో మానసికంగా కుంగిపోయానని వెల్లడి**
- **మరో అవకాశంగా భావించి మళ్లీ కృషి చేశానని వ్యాఖ్య**

**న్యూఢిల్లీ, జూలై 22 (తెలంగాణ ముచ్చ-ట్లు):** ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసనలు, అసమ్మతి అత్యంత కీలకమైనవని, అవి ప్రజాస్వామ్యానికి అంతర్భాగమని నీట్ టాపర్ ఆర్యన్ గుప్తా అన్నారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలను నిరసిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షలో 720 మార్కులకు గాను 715 మార్కులు సాధించి ఆర్యన్ గుప్తా అగ్రశ్రేణి ప్రతిభ కనబరిచారు. నీట్ పరీక్ష రద్దు కావడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆర్యన్ గుప్తా తెలిపారు. పరీక్ష రద్దు వార్త తెలిసిన వెంటనే తీవ్ర నిరాశకు గురయ్యానని, మానసికంగా ఎంతో కుంగిపోయానని, ఆ బాధతో కన్నీళ్లు కూడా పెట్టుకున్నానని వెల్లడించారు. అయితే ఆ పరిస్థితిని ఎదుర్కొంటున్నది తాను ఒక్కడినే కాదని తర్వాత అర్థమైందన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది అభ్యర్థులు ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నారని, అందరూ మళ్లీ పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆర్యన్ చెప్పారు. ఆ సమయంలో నిరాశలో మునిగిపోకుండా దానిని మరో అవకాశంగా స్వీకరించాలని నిర్ణయించుకున్నానని, మరుసటి రోజు నుంచే మళ్లీ చదవడం ప్రారంభించి పూర్తి అంకితభావంతో సిద్ధమయ్యానని వివరించారు. తాను చేసిన కఠోర శ్రమకు నేటి ఫలితం నిదర్శనమని ఆర్యన్ పేర్కొన్నారు. ప్రతికూల పరిస్థితులు ఎదురైనా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా లక్ష్యంపై దృష్టి నిలిపితే విజయాన్ని సాధించవచ్చని తన అనుభవం ద్వారా చెప్పుకొచ్చారు. విద్యార్థులు కూడా ఇలాంటి పరిస్థితుల్లో ధైర్యాన్ని కోల్పోవద్దని సూచించారు. నీట్ పేపర్ లీక్ ఆరోపణలు, విద్యా వ్యవస్థలో సంస్కరణల అవసరంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న సమయంలో ఆర్యన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. వ్యవస్థల జవాబుదారీతనాన్ని ప్రశ్నించడంలో యువత గొంతుకకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడం ఆరోగ్యకరమైన ప్రక్రియలో భాగమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, నీట్ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ కార్యకర్తలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఈ నిరసనలకు పలువురు ప్రముఖులు, ప్రతిపక్ష నేతల నుంచి మద్దతు లభిస్తున్నట్లు సమాచారం.

# తక్షణ విచారణకు సుప్రీంకోర్టు నిరాకరణ

- **'చలో సంసద్' పిటిషన్‌పై అత్యవసర విచారణకు అవకాశం లేదన్న ధర్మాసనం**
- **"మా సమయాన్ని వృథా చేయొద్దు" అంటూ ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్య**
- **సాధారణ ప్రక్రియలోనే పిటిషన్ విచారణ జరుగుతుందని స్పష్టీకరణ**



**న్యూఢిల్లీ, జూలై 22 (తెలంగాణ ముచ్చ-ట్లు):** జాతీయ స్థాయి పరీక్షల్లో అవకతవకలపై విద్యార్థులు చేపట్టిన 'చలో సంసద్' నిరసన సందర్భంగా ఢిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. బుధవారం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ అంశాన్ని పరిశీలిస్తూ అత్యవసర విచారణ అవసరం లేదని స్పష్టం చేసింది. పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువస్తూ, నిరసన సందర్భంగా విద్యార్థులపై పోలీసులు అమానుషంగా వ్యవహరించారని, అందుకు సంబంధించిన దృశ్య ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. వాటిని పరిశీలించి గురువారం విచారణ చేపట్టాలని కోరారు. అయితే ఈ విజ్ఞప్తిని ధర్మాసనం అంగీకరించలేదు.

దీనిపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి, వీడియోలను పరిశీలించే సమయం తమకు లేదని, కోర్టు సమయాన్ని అనవసరంగా వృథా చేయవద్దని వ్యాఖ్యానించారు. అత్యవసర విచారణకు అవసరమైన పరిస్థితులు ఈ కేసులో కనిపించడం లేదని పేర్కొంటూ పిటిషన్‌ను సాధారణ విధానంలోనే పరిశీలిస్తామని స్పష్టం చేశారు. జాతీయ పరీక్షల నిర్వహణలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆధ్వర్యంలో విద్యార్థులు, యువత జూలై 20, 21 తేదీల్లో 'చలో సంసద్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్లమెంట్ సమావేశాల ప్రారంభ రోజున జంతర్‌మంతర్ వద్ద జరిగిన ఈ నిరసన ఉద్రిక్తంగా మారగా, పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు.

ఈ సందర్భంగా ఆందోళనకారులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు లాఠీచార్జి చేయడంతో పాటు బాష్పవాయువు ప్రయోగించినట్లు సమాచారం.

ఈ ఘటనలో పలువురు విద్యార్థులు, భద్రతా సిబ్బంది గాయపడినట్లు వెల్లడైంది. మరోవైపు ఆందోళనకారులే హింసాత్మకంగా ప్రవర్తించారని ఢిల్లీ పోలీసులు పేర్కొన్నారు. ఇదే అంశంపై దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కూడా అత్యవసరంగా విచారించేందుకు ఇటీవల నిరాకరించింది. ఇప్పుడు సుప్రీంకోర్టు కూడా అదే విధంగా స్పందించడంతో పిటిషనర్లు సాధారణ రిజిస్ట్రీ ప్రక్రియ ప్రకారమే తమ పిటిషన్ విచారణ కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## నర్సింగ్ కళాశాల ప్రారంభం

**కోయంబత్తూరులో నర్సింగ్ కళాశాలను ప్రారంభించిన ఉపరాష్ట్రపతి**

**కోయంబత్తూరు, జూలై 22 (తెలంగాణ ము-చ్చట్లు):** భారత ఉపరాష్ట్రపతి సి.పీ. రాధాకృష్ణన్ తమిళనాడులోని కోయంబత్తూరులో జీకేఎన్ఎం నర్సింగ్ కళాశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థులు, వైద్య నిపుణులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో నర్సుల సేవలు అత్యంత కీలకమని అన్నారు. రోగులకు చికిత్స అందించడమే కాకుండా ధైర్యం, ఓదార్పు, ఆశను కల్పించడంలో నర్సులు అమూల్యమైన పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. నర్సులు కేవలం సేవలు అందించే వారే కాకుండా మానవత్వం, కరుణ, అంకితభావానికి ప్రతీకలని ఉపరాష్ట్రపతి అన్నారు. వారి సేవాభావం రోగుల కోలుకునే ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తుందని, సమాజంలో నర్సింగ్ వృత్తికి మరింత గౌరవం లభించాలని సూచించారు. అభివృద్ధి చెందిన భారత లక్ష్యాన్ని 2047 నాటికి సాధించాలంటే దేశ ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. నైపుణ్యం, సేవాభావం, కరుణ కలిగిన ఆరోగ్య సిబ్బందిని తీర్చిదిద్దడం ద్వారా మాత్రమే నాణ్యమైన వైద్య సేవలు అందించగలమని అన్నారు. నాణ్యమైన ఆరోగ్య సేవలు, మెరుగైన విద్యా వ్యవస్థ ఒక అభివృద్ధి చెందిన దేశానికి రెండు ప్రధాన




స్తంభాలని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. వైద్య సేవల విస్తరణతో పాటు నివారణ వైద్యంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. దేశ ఆరోగ్య రంగంలో నర్సులు, వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బంది సమిష్టి కృషి ఎంతో అవసరమని ఆయన అన్నారు. ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, వైద్య సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, కుప్పుస్వామి నాయుడు ఛారిటీ ట్రస్ట్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ రిలీఫ్ అధ్యక్షుడు ఆర్. గోపీనాథ్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. నర్సింగ్ విద్యను మరింత ప్రోత్సహిస్తూ ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసేందుకు ఇలాంటి విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని వక్తలు అభిప్రాయపడ్డారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# మళ్లీ బన్నీతో పూజా?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన తదుపరి చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం దర్శకుడు లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కనున్న కొత్త సినిమాపై సినీ వర్గాల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఈ చిత్రం ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉండగా, కథానాయిక ఎంపికపై ఆసక్తికర ప్రచారం జరుగుతోంది.

తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో కథానాయికగా పూజా హెగ్డేను ఎంపిక చేసినట్లు కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రాలేదు. ఈ వార్త నిజమైతే, 'అల వైకుంఠపురములో' తర్వాత అల్లు అర్జున్, పూజా హెగ్డే జోడీ మరోసారి వెండితెరపై కనిపించనుంది. ఆ చిత్రంలో వీరిద్దరి జోడీకి ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది.

లోకేష్ కనగరాజ్ సినిమాలు యాక్షన్, స్టైలిష్ మేకింగ్, వేగవంతమైన కథనంతో ప్రత్యేక గుర్తింపు పొందాయి. అల్లు అర్జున్‌తో ఆయన కాంబినేషన్‌లో రూపొందనున్న ఈ చిత్రం కూడా భారీ స్థాయిలో తెరకెక్కనున్నట్లు సమాచారం. ప్రస్తుతం కథ, నటీనటుల ఎంపిక, ఇతర ప్రీ-ప్రొడక్షన్ పనులు కొనసాగుతున్నాయి.

అయితే పూజా హెగ్డే ఎంపికపై వస్తున్న వార్తలు ఇప్పటికీ అధికారికంగా ధృవీకరించబడలేదు. చిత్రబృందం నుంచి ప్రకటన వెలువడిన తర్వాతే ఈ క్రేజీ కాంబినేషన్‌పై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# ఆరోగ్యంపై అమితాబ్ స్పష్టత

బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ ఆరోగ్యంపై గత కొద్దిరోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రచారాలకు ఆయన స్వయంగా తెరదించారు. తనకు ఎలాంటి శస్త్రచికిత్స జరగలేదని, ప్రస్తుతం పూర్తిగా ఆరోగ్యంగానే ఉన్నానని స్పష్టం చేశారు.

ఇటీవల తన బ్లాగ్‌లో శస్త్రచికిత్స అనంతరం కోలుకునే ప్రక్రియ గురించి చేసిన వ్యాఖ్యలను చాలామంది తప్పుగా అర్థం చేసుకున్నారని అమితాబ్ తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందిన వ్యక్తి ఎదుర్కొనే పరిస్థితులను ఉదాహరణగా మాత్రమే వివరించానని, అవి తన వ్యక్తిగత ఆరోగ్యానికి సంబంధించినవి కావని చెప్పారు. అర్జెంటీనా-స్పెయిన్ ఫుట్‌బాల్ ఫైనల్ నేపథ్యంలో ఓడిన జట్టు తిరిగి నిలబడే పరిస్థితిని వివరించేందుకే ఆ వ్యాఖ్యలు చేశానని, కానీ వాటిని తన ఆరోగ్యానికి సంబంధించినట్లుగా ప్రచారం చేశారని ఆయన పేర్కొన్నారు.

ఈ వివరణతో అమితాబ్ ఆరోగ్యంపై నెలకొన్న సందేహాలకు తెరపడింది. తాను పూర్తి ఆరోగ్యంతో ఉన్నానని, త్వరలో ప్రభాస్ నటిస్తున్న 'కల్కి' సీక్వెల్ చిత్రీకరణలో పాల్గొననున్నట్లు కూడా వెల్లడించారు. దీంతో అభిమానులు ఊరట వ్యక్తం చేస్తూ, 83 ఏళ్ల వయసులోనూ ఆయన అదే ఉత్సాహంతో సినిమాల్లో కొనసాగుతున్నందుకు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# జీవితంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నా: రేఖ

నటి రేఖ వేదవ్యాస్ తన వ్యక్తిగత జీవితం, సినీ ప్రయాణం, ఆరోగ్య సమస్యల గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. చిన్న వయసులోనే జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నానని, అనుభవం లేకపోవడంతో ఆ పరిస్థితులను అర్థం చేసుకోవడానికి సమయం పట్టిందని తెలిపారు. అయితే కాలక్రమేణా పరిస్థితులకు అనుగుణంగా తాను మారిపోయానని చెప్పారు. సినీ కెరీర్‌లో ఒక దశలో పని ఆగిపోవడం తనపై తీవ్ర ప్రభావం చూపిందని, అలాంటి పరిస్థితి మళ్లీ రావద్దని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో మంచి రోజులు, మానసిక ప్రశాంతత, ఆరోగ్యం, ఉపాధి, ప్రేమ ఉండాలని ఆకాంక్షించారు.

గతంలో ఎదుర్కొన్న ఆరోగ్య సమస్య గురించి ప్రస్తుతం మాట్లాడేందుకు సిద్ధంగా లేనని రేఖ వేదవ్యాస్ స్పష్టం చేశారు. అది తన జీవితంలోని ఒక అధ్యాయమని, దేవుడి దయతో ఇప్పుడు పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నానని తెలిపారు. ఆ సమయంలో తన కోసం ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ముంబైలో నివసిస్తున్నానని, అవసరమైతే హైదరాబాద్‌లోనూ పని చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

బిగ్‌బాస్ కార్యక్రమంలో పాల్గొనడం తన వల్ల కాదని రేఖ వేదవ్యాస్ స్పష్టం చేశారు. ఆ కార్యక్రమంలో పోటీదారుగా ఉండాలంటే ఎంతో ధైర్యం అవసరమని, అక్కడ పాల్గొన్న వారందరినీ అభినందిస్తున్నానని తెలిపారు. అయితే అతిథిగా లేదా సృజనాత్మక కార్యక్రమాల కోసం పిలిస్తే తప్పకుండా వస్తానని చెప్పారు. ప్రేక్షకులతో మరింత అనుబంధాన్ని పెంచే మంచి పాత్రలు చేయాలన్నదే తన కోరిక అని వెల్లడించారు.





# 52 ఏళ్లకీ చెక్కుచెదరని అందం

హిందీతో పాటు తెలుగు సినీ పరిశ్రమలో తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించిన సీనియర్ నటి ఊర్మిళ మటోండ్కర్ మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం ఆమె వయసు 52 ఏళ్లు అయినప్పటికీ, తాజాగా సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న చిత్రాలు అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఆమె రూపం, ఫిట్‌నెస్, గ్లామర్‌ను చూసిన అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

హిందీలో విడుదలైన 'రంగీలా' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఊర్మిళ, అనంతరం వరుస విజయవంతమైన చిత్రాల్లో నటించి అగ్ర కథానాయికగా నిలిచారు. 1990వ దశకంలో తన నటన, నృత్యం, ప్రత్యేక శైలితో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు.

తెలుగు ప్రేక్షకులకు కూడా ఊర్మిళ సుపరిచితురాలే. అంతం, గాయం, మనీ మనీ, అనగనగా ఒక రోజు, భారతీయుడు వంటి చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు పొందారు. ముఖ్యంగా దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ తెరకెక్కించిన చిత్రాల్లో ఆమె పోషించిన పాత్రలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

యాభై ఏళ్లు దాటిన తర్వాత కూడా తన ఫిట్‌నెస్‌ను, అందాన్ని అదే స్థాయిలో కాపాడుకోవడంపై అభిమానులు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఆమె పంచుకున్న చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారగా, "ఇప్పటికీ యువ కథానాయికలకు ఏమాత్రం తీసిపోని అందం" అంటూ నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు.

# తల్లిదండ్రులే నా బాధ్యత: శ్రీ సత్య

బుల్లితెర నటి శ్రీ సత్య తన వ్యక్తిగత జీవితం, కుటుంబ బాధ్యతలు, ఆర్థిక ఇబ్బందుల గురించి మనసు విప్పారు. తల్లి వైద్య చికిత్స, సంరక్షణ కోసం ప్రతి నెలా రూ.2 నుంచి రూ.2.5 లక్షల వరకు ఖర్చు అవుతోందని తెలిపారు. మందులు, ఫిజియోథెరపీ, సంరక్షణ కోసం సహాయకురాలి జీతం వంటి వ్యయాలన్నింటినీ తండ్రితో కలిసి భరిస్తున్నట్లు చెప్పారు.

తమకు సొంత ఇల్లు, ఆస్తి ఏదీ లేదని, కుటుంబ వ్యాపారం నష్టపోవడంతో కరోనా కాలంలో ఉన్న ఇంటిని కూడా విక్రయించాల్సి వచ్చిందని శ్రీ సత్య వెల్లడించారు. తాను పని చేయలేని పరిస్థితి వస్తే తల్లిదండ్రుల భవిష్యత్తు ఏమవుతుందో అన్నదే తనను ఎక్కువగా భయపెడుతుందని చెప్పారు.

తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేయడం బాధాకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చిన్ననాటి నుంచి పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను వదిలేయడం సరైనది కాదన్నారు. ఇటువంటి సంఘటనలు సమాజంలో పెరుగుతుండటం బాధ కలిగిస్తోందని వ్యాఖ్యానించారు.

ఇక తనపై వస్తున్న శరీరాకృతి విమర్శలపైనా శ్రీ సత్య స్పందించారు. హార్మోన్ల సమస్యల కారణంగా బరువు పెరిగానని, ఆరోగ్య పరిస్థితిని అర్థం చేసుకోకుండా విమర్శించడం సరికాదన్నారు. ప్రతి ఒక్కరి శరీరంలో కాలానుగుణంగా మార్పులు సహజమని, వాటిని గౌరవించాలని సూచించారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in